Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్: 9440815774

ప్రచురణ : తిరుపతి | సంపుటి : 02 | సంచిక : 210 | అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు : 4 | వెల : 2



## ఝార్ఖండ్ అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత

- విద్యార్థులపై లాఠీఛార్జ్, వాటర్ కేనాన్ల ప్రయోగం
- పరీక్షల్లో అక్రమాలపై రాంచీలో విద్యార్థుల భారీ నిరసన
- అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులు
- బారికేడ్లు తొలగించేందుకు యత్నించడంతో వాటర్ కేనాన్లతో పోలీసులు అడ్డుకట్ట

## శరవేగంగా పనులు

- 2027 మార్చికి పోలవరం ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తి
- కేంద్రమంత్రి స్పష్టం
- రాజ్యసభలో పోలవరం నిర్మాణ పురోగతిపై వివరాలు వెల్లడి
- తొలిదశలో 41.15 మీటర్ల వరకే నీటి నిల్వకు అవకాశం
- 2023 ధరల ప్రకారం రూ.30,436.95 కోట్ల వ్యయం అంచనా



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై కేంద్ర ప్రభుత్వం కీలక వివరాలు వెల్లడించింది. ప్రాజెక్టు తొలిదశలో 41.15 మీటర్ల వరకు నీటి నిల్వకు అవకాశం ఉందని స్పష్టం చేసింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిధులు, పనుల పురోగతి, నిర్వాసితుల తరలింపు తదితర అంశాలను సవివరంగా సభ ముందు ఉంచారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 2023 ధరల ప్రకారం రూ.30,436.95 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ తెలిపారు. ఈ మొత్తం వ్యయంలో రూ.12,157.53 కోట్లను కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తుందని వెల్లడించారు. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 వరకు ఈ ప్రాజెక్టుకు కేంద్రం - మిగతా 3లో

## పటిష్ఠ భద్రతతో పాస్‌బుక్కులు



- 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం: సీఎం చంద్రబాబు
- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో - మిగతా 3లో



## గందరగోళం సృష్టించడమే ఆయన లక్ష్యం

- సభలో నుంచి పారిపోవద్దు రాహుల్
- సజావుగా పనిచేయకుండా అడ్డుకోవడమే వారి ఉద్దేశం: బీజేపీ
- గత 15 రోజులుగా పార్లమెంటుకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగిస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ధ్వజం
- అమిత్ షా ఇచ్చే సమాధానాన్ని వినే ధైర్యం కాంగ్రెస్‌కు ఉందా అని రిజిజు ప్రశ్న

## మోదీ, షా ధైర్యం చేయడంలేదు

- పార్లమెంటులో ప్రతిష్టంభన తొలగించేందుకు కాంగ్రెస్ 3 డిమాండ్లు
- ఢిల్లీలో యువతపై దాడికి ఆదేశించింది అమిత్ షానా కాదో చెప్పాలని డిమాండ్
- యువతపై జరిగిన దాడికి ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రామమందిరంలో దొంగతనం అంశంపైనా చర్చకు డిమాండ్



## సురక్షితంగా తీసుకొస్తాం



- థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న తెలుగు యువతకు అండగా మంత్రి నారా లోకేశ్
- ఉద్యోగాల పేరుతో థాయ్‌లాండ్‌కు వెళ్లి మోసపోయిన తెలుగు యువత
- సైబర్ నేరగాళ్ల చెర నుంచి తప్పించుకుని సరిహద్దుల్లో చిక్కుకున్న బాధితులు
- తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా అభ్యర్థన
- స్పందించిన మంత్రి నారా లోకేశ్, సురక్షితంగా రప్పిస్తామని హామీ
- విదేశాంగ శాఖ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఉద్యోగాల ఆశతో థాయ్‌లాండ్‌కు వెళ్లి, సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి మోసపోయిన తెలుగు యువతకు ఏపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మయన్మార్-థాయ్‌లాండ్ సరిహద్దుల్లో నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసి, కేంద్ర విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నట్లు ఆయన - మిగతా 3లో



## రామమందిర పూజారులకు కొత్త డ్రెస్ కోడ్

ఇకపై రోజూ పసుపు రంగు వస్త్రాలే!

## గోవింద నామాలతో పేరడీలా?

- వైఎస్సార్సీపీ నేతలపై పవన్ కల్యాణ్ ఫైర్
- నెల్లూరులో వైఎస్సార్సీపీ నేతల తీరుపై డిప్యూటీ సీఎం ఆగ్రహం
- రాజకీయాల కోసం పవిత్ర దైవ నామాలతో పేరడీలు చేయడం దారుణమన్న జనసేనాని
- హిందూ ధార్మిక విశ్వాసాలు, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మండిపాటు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాజకీయ నిరసనల కోసం పవిత్రమైన దైవ నామాలను, భక్తి గీతాలను అపహాస్యం చేయడంపై ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరు నగరంలో వైఎస్సార్సీపీ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో గోవింద నామాలను పేరడీలుగా పాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ అధికారిక 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. నెల్లూరు నగరంలో వైఎస్సార్సీపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ నిరసనల్లో వారు రాజకీయ విమర్శల కోసం దైవాన్ని కొలిచే మంత్రాలు, పవిత్ర నామాలను వాడుకున్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని భక్తితో కొలుస్తూ ఆలపించే పవిత్ర దైవ నామాలను పేరడీలుగా మార్చేశారు. భక్తి గీతాలను తమ రాజకీయ అవసరాల కోసం అపహాస్యం చేస్తూ పాడారు. వైఎస్సార్సీపీ నేతల ఈ తీరు వివాదాస్పదంగా మారింది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్‌గా - మిగతా 3లో

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్..

- ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!
- ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు
- తెలుగు మాట్లాడే యువతులనే టెలీకాలర్లుగా నియమించుకున్న కేటుగాళ్లు
- లోన్ల పేరుతో మోసం, 21 మంది యువతులతో పాటు వ్యక్తి అరెస్టు
- ప్రధాన సూత్రధారులు పరారీ, కొనసాగుతున్న దర్యాప్తు



# కుప్పంలో ఉద్రిక్తత.. వైసీపీ ధర్నా

**ర్యాలీకి అనుమతి నిరాకరణపై ఎమ్మెల్సీ భరత్ ఆగ్రహం**

**పోలీసులతో వాగ్వాదం.. రోడ్డుపై బైఠాయించిన వైసీపీ శ్రేణులు**



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు10:** కుప్పం పట్టణంలో సోమవారం వైసీపీ చేపట్టిన ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని వారం రోజుల క్రితమే పోలీసులకు వినతి పత్రం సమర్పించినప్పటికీ అనుమతి ఇవ్వలేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. దీంతో వైసీపీ శ్రేణులు ఎమ్మెల్సీ భరత్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో పోలీసులు వైసీపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు వ్యతి రేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదని వైసీపీ శ్రేణులు విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ.. కుప్పంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరో పించారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి కోరినా పోలీసులు అను మతి ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వారం రోజుల ముందే ర్యాలీకి సంబంధించి పోలీసులకు రిక్విజిషన్ ఇచ్చామని, అయినా అనుమతి నిరాకరించారని తెలిపారు. శాంతి యుత నిరసనలకు కూడా అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. మరోవైపు కూటమి విజయోత్సవ ర్యాలీ సందర్భంగా కొందరు తమ ఇంటి వైపు దూసుకొచ్చారని వైసీపీ నాయకులు ఆరోపించారు. దీంతో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘట నలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాగా, ఇరువర్గాల కార్యకర్తల రాకపోకలు, నినాదాలతో కుప్పం పట్టణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలను కాపాడేందుకు చర్యలు చేపట్టారు.

**శాంతిపురం ప్రీమియర్ లీగ్ విజేతగా**

# డేరింగ్ బాయ్స్ రాళ్లబూదుగూరు



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఆగస్టు10:** శాంతిపురం మండలంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో డేరింగ్ బాయ్స్ రాళ్లబూదుగూరు జట్టు వరుసగా రెండోసారి విజేతగా నిలిచింది. సుమారు 20జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. డేరింగ్ బాయ్స్ రాళ్లబూదుగూరు, సింధు ఆగ్రో జట్ల మధ్య జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో డేరింగ్ బాయ్స్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించింది. దీంతో టోర్న మెంట్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలిచి సత్తా చాటింది. విజేత జట్టు సభ్యులను శాంతిపురం మండలానికి చెందిన క్రీడాభిమానులు, యువత అభినందించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# అయ్యప్ప ఆలయ నిర్మాణానికి జర్నలిస్టుల విరాళం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** శ్రీకాళహస్తి సమీపంలోని నంది హిల్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పూర్ణ పుష్కలాంబా సమేత శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన ప్రముఖ జర్నలిస్టులు టీవీ5 రిపోర్టర్ పోలూరు హరీష్, బిగ్ టీవీ రిపోర్టర్ బొద్దులూరు చంద్రశేఖర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్మాణానికి విరాళం అందించారు. ఇరువురు అయ్యప్ప స్వామివారి ఆలయ నిర్మాణానికి రూ.5,116 చొప్పున విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప గురుస్వాములు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. స్వామివారి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. విరాళం అందించిన పోలూరు హరీష్, బొద్దులూరు చంద్రశేఖర్, వారి కుటుంబ సభ్యులపై శ్రీ పూర్ణ పుష్కలాంబా సమేత శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామివారి పరిపూర్ణ అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు మురళి స్వామి, సుధాకర్ స్వామి, మునీశ్వర్ స్వామి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సమస్యల పరిష్కార వేదికకు 30 ఫిర్యాదులు



**గంగవరం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం అంబేద్కర్ భవన్‌లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది చింతమాకుల పుణ్యమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బహుజన సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 30 ఫిర్యాదులు అందినట్లు బహుజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వి. మునిరత్నం, జిల్లా గౌరవ అధ్యక్షుడు తరిగొండ మణి తెలిపారు. చౌడేపల్లి, పుంగనూరు, పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు చెందిన రైతులు, బాధితులు తమ సమస్యలను పుణ్యమూర్తికి వివరించారు. ఫిర్యాదులను పరిశీలించిన ఆయన బాధితులకు న్యాయ సలహాలు అందించడంతో పాటు, కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. పలమనేరు గడ్డూరు కాలనీలో ఇంటి స్థల వివాదంతో దళిత వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బాధితులు న్యాయం చేయాలని కోరగా, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పుణ్యమూర్తి హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను స్థానిక బహుజన కార్మిక, రైతు సంఘాల నాయకులు పర్యవేక్షిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు పుణ్యమూర్తిని కలిసి న్యాయపరమైన సలహాలు తీసుకున్నారు. జాతీయ మానవ హక్కుల నాయకుడు వేలాయుధం జన్మదినం సందర్భంగా పుణ్యమూర్తిని శాలువాతో సన్మానించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది.

# పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం

**కుప్పంలో 64 వినతులు.. రెవెన్యూకు అత్యధికంగా 29 కడపిడి వికాస్ మర్మత్**





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** ప్రజలు అందజేసే సమస్యలపై అధికారులు వేగంగా స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ సూచించారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి 64 వినతులు స్వీకరించారు. కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు రాజు ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలు, పింఛన్లు, ఆరోగ్యం, పోలీస్, విద్య, పంచాయతీరాజ్ తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. మొత్తం 64 వినతుల్లో రెవెన్యూ శాఖకు 29 అత్యధికంగా అందాయి. పింఛన్లకు 4, ఆరోగ్యం, పోలీస్, విద్యాశాఖలకు చెరో 3 చొప్పున వినతులు వచ్చాయి. పంచాయతీరాజ్, పీ4, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఆర్థిక సహాయం, రాజకీయ, క్రెస్కో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గృహ నిర్మాణం, ఆర్అండ్‌బీ శాఖలకు చెరో 2 చొప్పున, ఉపాధి, ఏపీఎస్ఆర్టీసీ, బీసీ సంక్షేమం, పెండింగ్ బిల్లులకు ఒక్కొక్క వినతి నమోదైంది. ఈ సందర్భంగా వికాస్ మర్మట్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరించి నమోదు చేయడంతో ప్రక్రియ పూర్తయినట్లు భావించరాదన్నారు. సమస్యకు వాస్తవ పరిష్కారం లభించే వరకు సంబంధిత అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని, వినతుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# కుప్పంలో కూటమి ప్రభుత్వ విజయోత్సవ ర్యాలీ

**భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు..ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద బహిరంగ సభ**







**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలో సోమవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, పి కే యం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌరీవారి శ్రీనివాసులు తదితర నాయకుల నాయకత్వంలో కూటమి నాయకులు కుప్పం చెరువు కట్ట నుంచి పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ కూడలి వరకు పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరిస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలో సందడి నెలకొంది. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన కార్యక్రమాలను నాయకులు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అవినీతి, అక్రమాలు, విధ్వంసంతో నష్టపోయిందని నాయకులు విమర్శించారు. ఆ పాలనకు ముగింపుపలికి అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రజలు కూటమికి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రానున్న రోజుల్లో అమలు చేయనున్న కార్యక్రమాలపై కూడా సభలో ప్రస్తావించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందించడంతో పాటు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ అడ్వైజర్ కమిటీ రాజకుమార్, రిస్క్ చైర్మన్ ప్రతాప్, టిటిడి బోర్డు మెంబర్ వైద్యం శాంతారం, డాక్టర్ సుధీర్, ఆర్ ఆర్ రవి, సోమశేఖర్, మంజునాథ్, జిమ్ దాము, జాకీర్ అహ్మద్, కన్నన్, లోకేష్, సత్యేంద్ర శేఖర్, గాజుల గోపీనాథ్, అప్పు (ముఖేష్) తదితరులు విజయోత్సవ ర్యాలీ, బహిరంగ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన కూటమి నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు, ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ఎస్సి సెల్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్ జన్మదిన వేడుకలు



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు10:** ఎస్ఆర్ పురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్ జన్మదిన వేడుకలు కొత్తపల్లి మిట్ట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. శ్యామ్ రాజ్ జన్మదిన సందర్భంగా కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు బోధన సామాగ్రి అందించారు. సామ్ రాజ్ జన్మదినము సందర్భంగా మిత్రులు సామ్రాజ్ అభిమానులు సుమారు 23 మంది రక్తదానం చేశారు. రాత్రి కొత్తపల్లి గ్రామంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు విజయ్ బాబు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుప్పయ్య సాఫ్ట్వేర్ సతీష్ గంగాధర్ నెల్లూరు వైసీపీ యువ నాయకుడు ఢిల్లీ, జగన్, కనిక రాజ్, శేషాద్రి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిష్కరించగలిగిన అర్జీలను ఖచ్చితంగా పరిష్కరించాలి



**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు10:** మండల స్థాయిలోనే పరిష్కరించగలిగిన ప్రజా సమస్యలను జాప్యం చేయకుండా ఖచ్చితంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ఆర్‌పురం మండలంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవె న్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను నాణ్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎక్కువగా రెవెన్యూ, భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు వస్తున్నందున మం డల స్థాయిలో పరిష్క రించగల వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్య క్రమంలో జీడీనెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్, జాయింట్ కలెక్టర్ ఏ.రాజేంద్రన్, డీఆర్వో మోహన్ కుమార్, ట్రైనీ కలెక్టర్ వెంకటేష్,చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. 217 వినతులు స్వీకరణ: ఎస్ఆర్‌పురం పీజీఆర్ఎస్‌లో మొత్తం 217 వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూశాఖకు 114,పోలీస్ శాఖకు25,సర్వే సెటిల్ మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు14, విద్యుత్ శాఖకు 6, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌కు 6, ఇతర శాఖలకు సంబంధించిన వినతులు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయ కులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా పరిశీలనను వార్డు సచివాలయాలు,

# పోలింగ్ బూత్‌లలో చేపట్టాలి



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** శ్రీకాళహస్తి పట్టణంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను మున్సిపల్ కార్యాలయానికే పరిమితం చేయకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే వార్డు సచివాలయాలు, పోలింగ్ బూత్‌ల స్థాయిలో నిర్వహించాలని 14వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఓటర్ల జాబితాకు, ప్రస్తుత జాబితాకు మధ్య పేరు, చిరునామా తదితర అంశాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నాయనే కారణంతో పట్టణంలో సుమారు 10 వేల మందికి పైగా ఓటర్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారని తెలిపారు. 3 నుంచి 4 రకాల గుర్తింపు పత్రాలతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి కమిషనర్ ఎదుట హాజరు కావాలని సూచించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేలాది మంది ఒకేసారి మున్సిపల్ కార్యాలయానికి రావడంతో తీవ్ర రద్దీ ఏర్పడుతోందని, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వార్డు స్థాయిలోనే పరిశీలన చేపట్టాలి.ప్రజల సౌకర్యార్థం ప్రతి వార్డు సచివాలయంలో లేదా పోలింగ్ బూత్ వద్ద ప్రత్యేక అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేసి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించాలని కంఠా ఉదయ్‌కుమార్ కోరారు. సచివాలయాల వారీగా ప్రత్యేక సమయాలను కేటాయించి అక్కడే ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.సాంకేతిక కారణాలు లేదా స్వల్ప వ్యత్యాసాల కారణంగా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి, పరిశీలన ప్రక్రియను వికేంద్రీకరించి పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కంఠా ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

# పలమనేరులో దూరవిద్య కోర్సులు ప్రారంభం

**వి.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని ఎస్‌వీసీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశులు, కోఆర్డినేటర్ డాక్టర్ ఈ. వాసు తెలిపారు. యూజీసీ అనుమతితో వివిధ కొత్త కోర్సులను ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా తదితర విద్యార్హతలు కలిగిన విద్యార్థులు దూరవిద్య విధానంలో డిగ్రీ కోర్సులను పూర్తిచేసుకునే అవకాశం ఉందన్నారు. ఉద్యోగాలు, ఇతర కారణాల వల్ల రెగ్యులర్ కళాశాలకు హాజరుకాలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పలమనేరు ఎస్‌వీసీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలను సంప్రదించి కోర్సులు, ప్రవేశ అర్హతలు, ఫీజు తదితర వివరాలను తెలుసుకోవాలని ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ కోరారు. కోర్సుల వివరాలు: దూరవిద్య ద్వారా వివిధ డిగ్రీ, ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.

# గోవింద నామాలతో పేరడీలా?

-మొదటిపేజీ తరువాయి

స్పందించారు. వైఎస్సార్సీపీ నేతల వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

**భక్తుల మనోభావాలు దెబ్బతీశారు**

పవిత్రమైన గోవింద నామాలను రాజకీయాలకు వాడుకోవడం దారుణమని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. పేరడీల పేరుతో భక్తుల మనోభావాలను వైఎస్సార్సీపీ నేతలు తీవ్రంగా కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ నేతలు, కార్యకర్తలు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందన్నారు. వారి వైనం కోట్లాది మంది భక్తుల ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ స్వార్థం కోసం దేవుడిని వివాదాల్లోకి లాగడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు.

**చట్ట ప్రకారం ముందుకెళ్లండి**

మతపరమైన విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతోనే వైఎస్సార్సీపీ నేతలు ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు ఘటనలో పాల్గొన్న వారిపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని జనసేన పార్టీ నాయకులకు, శ్రేణులకు ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. భక్తుల ధార్మిక విశ్వాసాలు దెబ్బతీసిన వారిపై న్యాయపరంగా పోరాడాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ**

ఈ సందర్భంగా వైఎస్సార్సీపీపై పవన్ కల్యాణ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా



దక్కించుకోలేని పార్టీ వైఎస్సార్సీపీ అంటూ ఆయన ఎద్దేవా చేశారు. అలాంటి పార్టీ రాజకీయాల కోసం ఇంతటి దిగజారుడు చర్యలకు పాల్పడటం విచారకరం అన్నారు. ధార్మిక విశ్వాసంలో భాగమైన దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలు, పవిత్ర కీర్తనలను అపహాస్యం కోసం వాడే విధానాన్ని నాయకులందరూ తక్షణమే విడిచిపెట్టాలని పవన్ కల్యాణ్ సూచించారు. రాజకీయ నిరసనలు హుందాగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి కానీ, భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ నేతలు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో శ్రీవారి భక్తిగీతాలను పేరడీ చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారని జనసేన నాయకులు ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో వైఎస్సార్సీపీ శాసనమండలి సభ్యుడు చంద్రశేఖరరెడ్డి నిర్వహించిన ధర్నాలో శ్రీవారిపా టలకు పేరడీ చేసి హిందువుల మనోభావాలను దెబ్బదీశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. డీఎస్సీలో అక్రమాల పేరుతో నెల్లూరులో చేసినదీక్షలో శ్రీవారి భక్తి గీతాన్ని అవహేళన చేశారని తిరుపతి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి కిరణ్ రాయల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని కించపరిచేలా వ్యవహరించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ధర్నాలో పాల్గొన్న ఇతర నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....

**విజయవాడ :** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు. అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి. ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద



సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ**

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

# ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

**ఒంగోలు :** ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్మ రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం



ఉందంటున్నారు. ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు. ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

## సురక్షితంగా తీసుకొస్తాం..

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు.

**వివరాల్లోకి వెళితే...**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒకరితో సహా మొత్తం ఆరుగురు యువకులు మంచి ఉద్యోగాల కోసం ఓ ఏజెంట్‌ను నమ్మి థాయ్‌లాండ్‌కు వెళ్లారు. అయితే, అక్కడకు చేరాక వారు మోసపోయారని గ్రహించారు. సైబర్ నేరాలకు పాల్పడే ఓ ముఠా వీరిని నిర్బంధించి, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి బలవంతంగా దించింది. ఈ నరకం నుంచి బయటపడేందుకు బాధితులు ఎలాగోలా కొంత డబ్బు చెల్లించి, వారి చెర నుంచి తప్పించుకున్నారు. ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ వైపు ఉన్న మయన్మార్ సరిహద్దు ప్రాంతానికి చేరుకుని అక్కడే చిక్కుకుపోయారు. తమను ఎక్కడికైనా తరలించే ప్రమాదం ఉందని భయపడుతూ, తమను రక్షించాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ వీడియోలు, పోస్టులు వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**స్పందించిన మంత్రి లోకేశ్**

ఈ విషయం తన దృష్టికి రావడంతో మంత్రి నారా లోకేశ్ వెంటనే స్పందించారు. బాధితుల ఆందోళన, వేదనను తాను అర్థం చేసుకోగలనని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "థాయ్‌లాండ్‌లో చిక్కుకున్న యువత పరిస్థితి గురించి తెలిసింది. వారి కుటుంబ సభ్యుల ఆందోళనను అర్థం చేసుకోగలను. బాధితులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి, కేంద్ర విదేశాంగ శాఖ, సంబంధిత రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు తన కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ చర్యలతో బాధితులు త్వరలోనే సురక్షితంగా స్వదేశానికి తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22–ఏ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22–ఏ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ–కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు

## శరవేగంగా పనులు

-మొదటిపేజీ తరువాయి

రూ.12,620.53 కోట్లు విడుదల చేసినట్లు రాజ్యసభలో ఆయన వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని కేంద్రం స్పష్టంగా వివరించింది. ప్రాజెక్టులో వివిధ దశల పనులు ఏ మేరకు పూర్తయ్యాయో గణాంకాలతో సహా వెల్లడించింది. స్పిల్‌వేకి సంబంధించి మట్టి పనులు 96.8 శాతం పూర్తి కాగా, కాంక్రీట్ పనులు 98.8 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయినట్లు తెలిపింది. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణంలో మట్టి పనులు 75.5 శాతం, కాంక్రీట్ పనులు 81.9 శాతం, స్టీల్ పనులు 81.3 శాతం పూర్తయినట్లు వెల్లడించింది. ప్రధాన కాలువల పనుల్లో మట్టి పనులు అత్యధికంగా 98.9 శాతం పూర్తి కాగా, కాంక్రీట్ పనులు 88.4 శాతం, స్టీల్ పనులు 55.6 శాతం పూర్తయినట్లు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

**నిర్వాసితుల పునరావాసం**

పోలవరం ప్రాజెక్టు వల్ల మొత్తం 96,660 మంది నిర్వాసితులు అవుతున్నారని కేంద్రం రాజ్యసభకు తెలిపింది. ఇందులో తొలిదశ నీటి నిల్వ (41.15 మీటర్లు) కారణంగా ముంపునకు గురయ్యే 17,892 మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించింది. నిర్వాసితుల సహాయ, పునరావాస చర్యల కోసం ఇప్పటివరకు రూ.1,373.01 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించింది. ఈ పునరావాస పనుల కోసం ఇంకా మరో రూ.1,581.08 కోట్లు అవసరం అవుతాయని కేంద్రం అంచనా వేసింది.

**మరో ఏడాది పొడిగింపు**

పోలవరం ప్రాజెక్టు తొలిదశ పనులను 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ స్పష్టం చేశారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టు తొలిదశ పూర్తి లక్ష్యాన్ని మరో ఏడాది పాటు పొడిగించినట్లు ఆయన రాజ్యసభ వేదికగా వెల్లడించారు. నిర్దేశించిన గడువులోగా తొలిదశ పనులను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టం చేశారు.

## గంజాయి వినియోగం పై కార్మికులకు అవగాహన సదస్సు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**

శ్రీకాళహస్తి గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, నమోదయ్యే కేసులు, చట్టపరమైన పరిణామాల పై కార్మికులకు అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని ఊరందూరు రోడ్డులో ఉన్న లలిత్ ఇన్నోవేషన్ రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు గంజాయి నిర్మూలన పై అవగాహన సదస్సు రూరల్ సీఐ జి. ఇబ్రహీం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ జి. ఇబ్రహీం మాట్లాడుతూ గంజాయి సేవించడం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక సమస్యలు, గంజాయి కలిగి ఉండటం, వినియోగించడం, రవాణా చేయడం వంటి వాటి పై నమోదయ్యే కేసులు, చట్టపరమైన పరిణామాలను వివరించారు. అనంతరం కార్మికులకు గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎవరైనా గంజాయి విక్రయించడం, రవాణా చేయడం లేదా వినియోగించడం గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఒక ఇంటికి ఒక మొక్క – పచ్చని భవిష్యత్తుకు ఒక అడుగు



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:** శ్రీకాళహస్తి సామాజిక సేవలో భాగంగా స్వచ్ఛంద సేవకుల ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక ఇంటికి ఒక మొక్క పచ్చని భవిష్యత్తుకు ఒక అడుగు" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెంపొం దించడంతో పాటు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిం చవచ్చని తెలిపారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని క్రమం తప్పకుండా సంరక్షించాలని ప్రజలకు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, విజయ్, కవిత, ఫర్జానా, యశ్వంత్, భరత్, మోహన్ తదితర స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**60 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల ఆర్థిక సాయం**



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**
ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ అన్నారు. వెదురుకుప్పం మండలం దేవలంపేట గ్రామంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 60 మంది లబ్ధిదారులకు రూ.44 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి పంపిణీ చేశారు. అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా అందుతున్న ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, జనసేన నియోజకవర్గ బాధ్యులు పొన్నా యుగంధర్, బీజేపీ నియోజకవర్గ బాధ్యులు రాజేంద్రన్, ఎస్ఆర్‌పురం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జయంతి గుండయ్య, మండల అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్, రుద్రయ్య నాయుడు, జయశంకర్ నాయుడు, స్వామిదాస్, చంగల్‌రాయ మందడి, ఎంపీడీవో పురుషోత్తం, ఎమ్మార్వో బాబు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మరకాళ్లకుప్పం సుధాకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంకటరమణారెడ్డి, భాష్యం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 10 :**



అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. తవణంపల్లి మండలం ముత్తరపల్లి గ్రామానికి చెందిన కె. చిరంజీవి (24) రేణిగుంట మండలం వెంకటాపురం గ్రామ సమీపంలోని ఇటుకల తయారీ కేంద్రంలో కూలి పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు.వివాహ సమయంలో చేసిన సుమారు రూ.4 లక్షల అప్పులను తీర్చేందుకు కూలి పనులు చేస్తుండగా, అప్పుల భారం పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం రాత్రి తన సోదరి చందనకు ఫోన్ చేసి అప్పులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తీర్చడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.సోమవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో పక్కనే నివాసం ఉంటున్న వ్యక్తి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే చిరంజీవి తాను నివాసం ఉంటున్న రేకుల షెడ్డు పైకప్పులోని ఐరన్ రాడ్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఎం.నాగవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## మెగా డీఎస్సీ.. దగా డీఎస్సీ!

**హిందూపురంలో వైసీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ**

**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు10:**



మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హిందూపురం నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దీపిక వేణురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధు మతి రెడ్డి పాల్గొన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమా నులు,పార్టీ కుటుంబ సభ్యులు బైక్‌లతో పాల్గొన్నారు. "మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ", "కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్"అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో హిందూపురం పట్టణ వీధులు మార్మోగాయి. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డీఎస్సీ విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిస్మిల్లా పార్క్‌కు మహర్దశ!

**అభివృద్ధి, పారిశుద్ధ్య పనులకు వేగం**



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 10:**
పట్టణంలోని బిస్మిల్లా పార్క్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేస్తున్నట్లు ఎంపీడీవో రవిచంద్ర తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. సోమవారం పంచాయతీ ఈవో శ్రీధర్‌తో కలిసి పార్కులో జరుగుతున్న పనులను ఎంపీడీవో పరిశీలించారు. పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం పెంపొందించడంతో పాటు నడక మార్గాలు, పిల్లలు, మహిళలు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పూర్వ వైభవం తీసుకొస్తాం: టీడీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పార్కు అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. త్వరలోనే పార్కును సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు.

## శ్రీధర్ వర్మకు ఘన సత్కారం

**ఎస్వీబీసీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణపై శుభాకాంక్షలు**



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**
శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) నూతన చైర్మన్‌గా నియమితులైన బెత రాజు శ్రీధర్ వర్మను టీడీపీ రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పార్టీనాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మకు గజమాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్వీబీసీ ద్వారా శ్రీవారిభక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మహబూబ్ బాషా ఆకాంక్షించారు. దేశ, విదేశాల్లోని భక్తులకు తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయాలను చేరువ చేయడంలో ఎస్వీబీసీ మరింత కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిపాళ్యం రాజశేఖర్‌రెడ్డి, కిరణ్, బాబు, చిన్నబాబు, వేణు, సంపత్ పాల్గొన్నారు.

## పాన్ బ్రోకర్ల దగా నుంచి పేదల బంగారాన్ని కాపాడాలి

**ఆర్ఎస్‌పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి**



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**
పేదలు,సామాన్యులు ఆర్థిక ఇబ్బందుల్లో కుదువ పెట్టిన బంగారంపై అధిక వడ్డీలు వసూలు చేస్తూ కొందరు పాన్ బ్రోకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ ఆర్ఎస్‌పీ పార్టీ నాయకులు సోమవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. హిందూపురం మెయిన్ బజార్‌లోని ఓ పాన్ బ్రోకర్ వద్ద చేనేత కార్మికుడు సూగూరు వెంకటేశులు తన ఆర్థిక అవసరాల నిమిత్తం 2020సెప్టెంబర్ 19న సుమారు 22 గ్రాముల బంగారు చైన్, ఉంగరం, బొట్టు కుదువ పెట్టి రూ.50 వేల రుణం తీసుకున్నారని నాయకులు తెలిపారు. అప్పట్లో వడ్డీ రెండు రూపాయలుగా చెప్పినప్పటికీ, ప్రస్తుతం బంగారం విడిపించుకోవడానికి రూ.50 వేల అసలుకు సుమారు రూ.2.75 లక్షల వడ్డీ కలిపి మొత్తం రూ.3.20 లక్షలు చెల్లించా లని కోరుతున్నారని ఆరోపించారు. బంగారం విడిపించుకునేందుకు వెళ్లి నప్పుడు బెదిరింపులకు పాల్పడుతు న్నారని,చదువులేని పేదలను రసీదుల్లో ని నిబంధనలను అర్థం చేసుకోలేకపోవ డాన్ని ఆసరాగా చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆర్ఎస్‌పీ నాయకులు ఆరోపించారు. రసీదుల్లో 11 నెలల కాల పరిమితి వంటి నిబంధనలను పేర్కొంటున్నప్పటికీ, ముందస్తుగా ఫోన్ లేదా నోటీసు ద్వారా సమాచారం ఇవ్వకుండా పేదల బంగారాన్ని స్వాధీనం చేసుకునే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. వెంకటేశులుకు చెందిన బంగారాన్ని వెంటనే ఇప్పించడంతో పాటు, అధిక వడ్డీల పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న పాన్ బ్రోకర్లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఇలాంటి అన్యాయానికి గురైన బాధితులందరినీ సమీకరించి ప్రత్యక్ష పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఎస్ఎఫ్ వెంకటేష్, రవికుమార్, వెంకటేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చంగల్రాయ స్వామి వసంతోత్సవం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**



శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ చంగల్రాయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం దేవస్థానం మూడో గేటు సమీపంలోని వసంత మండపం వద్ద శ్రీ చంగల్రాయ స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వసంత సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవా ర్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి బి.కె. వెంకటేశులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్, బోర్డు సభ్యుడు గుర్రప్ప శెట్టి, ఇతర సభ్యులు, దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 1న చలో విజయవాడను జయప్రదం చేయాలి

**సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**
శ్రీకాళహస్తి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జల వనరుల కార్యాలయంలో సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి యువ కిషోర్, శ్రీకాళహస్తి అధ్యక్షుడు, ఏపీఎన్జీవో ట్రెజరర్ వి. గంగయ్య, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు డి. కాసిం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సీపీఎస్ ఉద్యోగులతో చర్చించి, వారికి ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానాన్ని తీసుకొస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా సీపీఎస్ ఉద్యోగుల సమస్యపై ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే సీపీఎస్ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించనున్న కార్యక్రమానికి తిరుపతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇటీవల జారీ చేసిన జీవో ఎంఎస్ నం.57 ద్వారా 2003 నోటిఫికేషన్, 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయడంపై అభినందనలు తెలిపారు. అలాగే సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ బకాయిలను చెల్లించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే రాష్ట్రంలో మూడు లక్షలకు పైగా ఉన్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా న్యాయం జరిగేలా సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి ఎస్. విజయమ్మ, వైస్ ప్రెసిడెంట్ కాసిం, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.కె. భాష తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థినులకు రోటరీ క్లబ్ చేయూత



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు10:**
శ్రీకాళహస్తి సమాజంలో నిరుపేదలు, అనాథ పిల్లలకు అండగా నిలిచి వారి భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మల్లెమాల ప్రమీల అన్నారు.ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ఇటీవల నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తల్లిదండ్రులు లేని, అత్యంత నిరుపేద విద్యార్థినులు యూనిఫాంల కొరతతో ఇబ్బందులు పడుతున్న విషయం రోటరీ క్లబ్ దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన క్లబ్ సభ్యులు 25 మంది అర్హులైన పేద విద్యార్థినులకు ఉచితంగా యూనిఫాంలను అందజేశారు. కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రమీల మాట్లాడుతూ సమస్య తమ దృష్టికి వచ్చిన అతి తక్కువ సమయంలోనే స్పందించి విద్యార్థినులకు దుస్తులు అందజేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తమ గ్రామానికి, చదివిన కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కొత్త యూనిఫాంలు అందుకున్న విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు. నిరుపేద విద్యార్థినులకు రోటరీ క్లబ్ అందించిన సేవలను కళాశాల యాజమాన్యం, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి మ్యాగీ క్లారా, సభ్యులు కృష్ణకుమార్, సదానందం, ఎమ్మెస్ రెడ్డి, ప్రమీల, కళాశాల ప్రిన్సిపాల్ భారతి, అధ్యాపకులు, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్టు 10:**
శ్రీకాళహస్తి బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ ప్రియాంక తెలిపారు. శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎల్లంపల్లి గిరిజన కాలనీలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, కౌమార దశలో బాలికల ఆరోగ్యం తదితర అంశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, కౌమార దశలో బాలికలు గర్భం దాల్చడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. బాల్య వివాహాలను నిర్వహించడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల కారణంగా బాలికలు విద్యను మధ్యలోనే నిలిపివేసి భవిష్యత్తు అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కారణంగా కొన్ని సందర్భాల్లో బాల్య వివాహాలు పరోక్షంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తల్లిదండ్రులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల విద్యను మరింత బలోపేతం చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించవచ్చన్నారు. సమాజం ఈ దిశగా ఆలోచించినప్పుడు బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరి విద్యావంతులవుతారని తెలిపారు. విద్య ద్వారా బాలబాలికల్లో సామాజిక అవగాహన పెంపొందడంతో పాటు వివక్షను తగ్గించి, పేదరిక నిర్మూలనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. విద్యతో బాలబాలికలు తమ భవిష్యత్తుపై ప్రణాళికలు రూపొందించుకోగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ విజయవాహిని కోఆర్డినేటర్ లక్ష్మీ, ప్రగతి సంస్థ కో–కన్వీనర్ రామచంద్ర, కిషోర్, బాలికలు, తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్ పోలమ్మ, ఆశా వర్కర్ రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143